దుమ్ము అంతా నొల్లు కొంటుంది, దేహాన్ని ప్రారబ్ధమునకు వదిలివెయ్యి, దాని ప్రభావం నీమీద పడకుండా చూసుకొంటే మనస్సు కొంచెం కొంచంగా చైతన్యం వైపుకు జరిగి చైతన్యంలో ఐక్యమవుతుంది,

## కాపవరంలో శ్రీనాన్నగారి ప్రవచనము, 10-12-97)

**ప్రియమైన ఆత్మ బంధువుల్లారా,**

ఈరోజు గీతా జయంతి. ఈసృష్టిలో రకరకాలు జీవకోటి ఉంటుంది. అందరిని దృష్టిలో పెట్టుకొని స్వామి భగవద్గీత చెప్పాడు. భగవద్గీత మనకు తల్లివంటిది. మనం ఏరకంగా జీవిస్తే ఆధ్యాత్మిక పురోగతి వస్తుందో వివరంగా భగవంతుడు గీతలో చెప్పాడు. గీత ఉపదేశ గ్రంధం, భగవంతుడు జీవుడికి ఉపదేశించిన గ్రంథం. ఏది చేయాలి, ఏది చేయకూడదు అని అర్జనుడికి మానసిక ఘర్షణ వచ్చినప్పడు ఆ టైము చూసుకొని ఆఘర్షణలో భగవంతుడు అర్జునుడికి గీత చెప్పాడు. అందరూ శాంతి కావాలి అని అడుగుతారు. ధనం ఉన్నవాడు, ధనంలేనివాడు, చదువు ఉన్నవాడు, చదువులేనివాడు అందరూ కూడా శాంతి కావాలి అంటారు. ఎందుచేతనంటే శాంతి లేకపోతే మనం ప్రకృతి గుణాలతో పోరాడలేము. నీదేహ ప్రారబ్దమును బట్టి అనుకూల పరిస్థితులు వస్తూ ఉంటాయి, ప్రతికూల పరిస్థితులు వస్తూ ఉంటాయి. కాని అన్నీ కాలప్రవాహములో కొట్టుకొని పోతాయి. అందువలన అనుకూల పరిస్థితులు వచ్చినప్పడు పొంగిపోవద్దు, ప్రతికూల పరిస్థితులు వచ్చినప్పడు కృంగిపోవద్దు. పొంగిపోయిన కృంగిపోయినా నీ హృదయంలో ఉన్న ఈశ్వరుడు నీకు దొరకడు తపస్సు ఎందుకంటే అనుకూల పరిస్థితలు వచ్చినప్పడు పొంగిపోకుండా, ప్రతికూల పరిస్థితులు వచ్చినప్పడు కృంగిపోకుండా తపస్సు నీకు సహకరిస్తుంది. అది తపస్సు యొక్క ప్రయోజనం. జీవలక్షణాల నుండి విడుదల పొందటానికి నీవు చేసే ప్రయత్నమే తపస్సు. తపస్సు వలన మానసిక బలం వస్తుంది, పవిత్రత వస్తుంది, ఎటువంటి పరిస్థితులు వచ్చినా వాటిని ఎదుర్కొనే శక్తి వస్తుంది. నీకు చెడు జరిగినా, మంచి జరిగినా ఇది నిత్యము కాదు అనుకోండి దాని ప్రభావము మీమీద తగ్గిపోతుంది.

నీకు సుఖం వచ్చినా, దుఃఖం వచ్చినా అది శాశ్వతంగా ఉండదు. 10 రోజుల తరువాత దాని వేగం తగ్గిపోతుంది ఎందుచేతనంటే అది నిజం కాదు కాబట్టి. నీమనస్సు ఎంత నిజమో, నీ దేహము ఎంత నిజమో నీకు వచ్చే సుఖం, దుఃఖం కూడా అంతే నిజం. చెడు చేస్తే పాపం, మంచి చేస్తే పుణ్యం వస్తుంది. పుణ్యఫలం సుఖం, పాపఫలం దుఃఖం. రెండూ అనుభవిస్తే పోతాయి. జ్ఞాన ఫలితం మోక్షం అది కాల ప్రవాహాములో కొట్టుకొని పోయేది కాదు. నీవు జ్ఞానం సంపాదిస్తే మోక్షం వస్తుంది ఇంక చిల్లర విషయాలు మీకు ఎందుకు. గీతను అధ్యయనం చేసి అర్ధం చేసుకొంటే పుణ్యం వస్తుంది. అర్ధం చేసుకొని ఆచరిస్తే మోక్షం వస్తుంది. ఈశ్వరుడు అంటే నియమించే వాడు, ప్రభువు. ఆయన మన హృదయంలో ఉంటాడు. ప్రారబ్దమునుసరించి జీవులను ఆడిస్తూ ఉంటాడు. మౌనంగా

ఉంటాడు ఆయన ఉన్నట్లు మనకు తెలియదు. మీకు తలంపు రాకముందే మీకు ఏ తలంపు వస్తోందో మీ లోపల ఉన్న ఈశ్వరుడు చూస్తాడు. మీరు నిరాడంబరముగా ప్రయత్నం చేస్తూఉంటేదానికి ఆయన సపోర్టు ఇస్తాడు ఆయనే ఈశ్వరుడు. నాకు జ్ఞానం కావాలి, నాకు జ్ఞానం కావాలి అని అంటే నీకు జ్ఞానం కలుగదు. నీలోపల ఉన్న కంట్రోలర్ ఎవరికి తెలియబడాలి అని అనుకంటే వారికే తెలియబడతాడు అంతే కాని నీవు అడిగినంత మాత్రంచేత నీకు తెలియబడడు మనం మంచి వాళ్ళం అని మనం అనుకుంటే సరిపోదు. ఈశ్వరుడు అనుకోవాలి. నీవు చేసిన పనులను భగవంతుడు చూడడు. భగవంతడు మోక్షం ఇవ్వాలి అనుకొన్నప్పడు ఆచివరి క్షణంలో మీలో అహంకారము ఉందా, లేదా అని చూస్తాడు. అహంకారము లేదా నీకు మోక్షాన్ని ఇస్తాడు, అహంకారము ఉంటే సంసార చక్రంలో పడేస్తాడు.

భగవంతుడు సంతోషించే పనులు చేయి. నీవు మాట్లాడే మాట, నీవు చేసే పని భగవంతుని అనుగ్రహం పొందటానికి అనుకూలంగా ఉండాలి. ఇతరులను అదే పనిగా ఎవరైనా విమర్శిస్తూ ఉంటే నీవు అక్కడ నుండి వెళ్ళిపోవాలి,.లేకపోతే దానివల్ల వచ్చేపాపం నీకు కూడా వస్తుంది. మాయను ఆయుధంగా చేసుకొని ఈజీవకోటిని సంసార చక్రంలో త్రిప్పతున్నాను అన్నాడు భగవంతుడు. మాయ నశించింది అనుకోండి సంసారచక్రంనుండి బయట పడతారు, భగవంతుని స్వరూపమును పొందుతారు. హృదయంలో ఉన్న ఈశ్వరుడికి శరణాగతి చెందితే దుఃఖం కలుగదు. నీ సంకల్పమే నా సంకల్పము అనుకొంటే దుఃఖానికి అవకాశం లేదు. ఎవడికైతే వైరాగ్యం ఉందో వాడు మాత్రమే సత్యాన్ని పొందటానికి అర్హత పొందుతాడు. నీ హృదయంలో ఉన్న ప్రభువు యొక్క ప్రసాదం నీకు కలగాలి .ప్రసాదం అంటే అనుగ్రహం. అది లేకుండా శాంతిని పొందలేవు, నిర్మలత్వం రాదు.

నాకు శాంతి కావాలి, నాకు శాంతికావాలి అంటే శాంతిరాదు ఎప్పడైన భగవంతుని స్మరించావా భగవదనుగ్రహం పొందటానికి ఏమైనా చేసావా, నిన్ను నీవు మర్చిపోయి తోటి మానవులను ప్రేమించావా పదిమందికి ఉపయోగపడే పని ఏదైనా చేసావా ఏమి చేయకుండా నాకు శాంతికావాలి అంటే నీకు శాంతి ఎలా వస్తుంది. నీవు చేసే పనిని భగవంతుడు చూడడు. నీవు ఏతలంపుతో ఆపనిని చేస్తున్నావో భగవంతుడు చూస్తాడు. నీవు కీర్తి కోసం పనిచేస్తే కీర్తి ఇచ్చేస్తాడు వీడి గొడవ వదిలింది అనుకొంటాడు. వాడి స్వరూపాన్ని మాత్రము ఇవ్వడు. కీర్తి చాలా గొప్పది అనుకొంటాము. కీర్తిని మొయ్యడం చాలా కష్టం. కొంత పవిత్రతను సాధించినవారు కూడా, చైతన్యస్థాయిలో కొంత అభివృద్ధిని సాధించినవారు కూడా కీర్తి కాంక్ష నుండి బయటకు రావటం చాలా కష్టం అని చెప్పారు. అందులో నుండి విడుదల పొందితేగాని దేవుని ప్రసాదానికి అర్హులు కారు. మనస్సులో ఒకటి ఆలోచిస్తూ నోటితో వేరొకటి చెపుతూ చేతితో ఇంకొకటి చేయటం వలన సమాజమును మోసం చేయగలముగాని ఈశ్వరుని మోసం చేయలేము. ఇలా జీవిస్తే మనం లోపల కుళ్ళి పోతాము. నిన్న బాగానే ఉంది, ఇవాళ శాంతి లేదు అని కొంత మంది అంటారు. భగవంతుని అనుగ్రహంవలన వచ్చే శాంతి అటువంటిది కాదు. అది శాశ్వతమైనది మీ దేహం మరణించినా అది చెదరదు మీ

ఇంటిలో అన్ని సదుపాయాలు ఉన్న మీకు శాంతి లేకపోతే మీకు ఆనందం లేదు. ఇది బజారులో కొనుక్కొనే వస్తువుకాదు. ఈశ్వరానుగ్రహంవలన రావాలి.

నన్ను ప్రేమించు, నాకు పూజ చెయ్యి, నాకు భక్తుడిగా ఉండు అని భగవంతుడు చెపుతున్నాడు. మనకు భగవంతుని మీద ప్రేమ లేదు అనుకోండి, ప్రేమ ఉన్నట్లు నటిస్తాము అనుకోండి అది ఆయనకు తెలిసిపోతుంది. ఎందువలన అంటే ఆయన సర్వసాక్షి, భగవంతుని మీద ప్రేమ పెరిగే కొలది ప్రకృతి విషయాల పట్ల ఆసక్తి తగ్గుతుంది. దేవుని అనుగ్రహం ఉంటే సాధ్యంకానిది సాధ్యం అవుతుంది. నీ మనస్సులో దుంగలలాంటి బరువైన వాసనలు ఉన్నా, కామక్రోధముల వేగం ఎంతఉన్నా వాటిని తొలగించి నిన్ను పవిత్రుడిని చేస్తాడు. గోడకు అవతల ప్రక్కన పాము ఉంది అని చెప్పారు అనుకోండి. అప్పుడు కర్రలేకుండా వెళ్ళటంకంటే కర్ర పట్టుకొని వెళ్ళటం మంచిది. అక్కడ పాము ఉంటే కర్ర అవసరం ఉంటుంది. పాము లేదు అనుకోండి నీ దగ్గర కర్ర ఉండటంవలన నష్టం లేదు. అలాగే దేవుడు లేడు అని జీవించడం కంటే దేవుడు ఉన్నాడు అని జీవించటం మంచిది. దేవుడు లేడు అని జీవిస్తే మరణానంతరము అక్కడ దేవుడు ఉంటే మనం నష్టపోతాము.

పని చెయ్యి. ఫలం దృష్టితో పనిచెయ్యకు. చిన్నచిన్న విషయముల మీద నీ మనస్సును పెట్టవద్దు. ఏదో ఊహించుకొంటూ కాకుండా పనిపనికోసమే చేస్తూఉంటే దేవుని అనుగ్రహానికి పాత్రుడవు అవుతావు. నీవు బెంగ పెట్టుకోవద్దు, కంగారుపడవద్దు, చింతాకంత చింతకూడా నీకు వద్దు. కొంత మంది గుర్తింపులు కోరుకొంటారు. వారు గుర్తించలేదు, వీరు గుర్తించలేదు అనుకొంటారు. అలా అనుకోవద్దు. వారు నీకు మోక్షాన్ని ఇవ్వరు. భగవంతుని అనుగ్రహం కలిగితే నీకు మోక్షం కలుగుతుంది. భగవంతుని అనుగ్రహం కోసం పనిచేస్తే జన్మాంతరములో నుండి ఏమైనా బలమైన వాసనలు ఉన్నా, భగవదనుగ్రహం పొందటానికి నీకు ఏమైనా అడ్డంకులు ఉన్నా అప్పుడే పుట్టిన దూడను ఆవు నాకి ఎలా శుభ్రం చేస్తుందో, అలా నీఅడ్డంకులు నాకేసి నిన్ను శుద్ధం చేసి నీకు శాశ్వత శాంతిని ఇచ్చే బాధ్యత నాది అని భగవంతుడు చెపుతున్నాడు. ఇంక నీకు దుఃఖపడవలసిన పని ఏముంది. అందువలన దుఃఖ పడవద్దు భగవదనుగ్రహం పొందితే నీలో ఎంత దుఃఖం ఉన్నా అది శాంతిగా, ఆనందంగా, మారిపోతుంది. దేహం తల్లి కడుపులో ఉండి బయటకు వచ్చినప్పడే ఈ దేహం ద్వారా ఏమి జరగాలో అన్నీ నిర్ణయింపబడే ఉంటాయి, అని భగవాన్ చెప్పారు. ఒక ప్లీడర్ గారు భగవాన్ దగ్గర ఉన్న ఫ్యాన్ స్విచ్‌ను ఆపుచేసి ఈటైములో రమణాశ్రమంలో ఫ్యాన్‌ను ఆపుచేయటం కూడా నా తల్లికడుపులో ఉండగానే నిర్ణయింపబడిందా అని అడిగారు. ఖచ్చితంగా ఇది కూడా నీతల్లి కడుపులో ఉండగానే నిర్ణయింపబడింది అని భగవాన్ చెప్పారు. అయితే సాధన ఎందుకు, పూజలు ఎందుకు, జపాలు ఎందుకు అని ఆ ప్లీడర్‌గారు అడిగారు. బాహ్యంగా జరిగే సంఘటనలు జరుగుతూ ఉంటాయి. ఆసంఘటనల ప్రభావం నీ మీద పడకుండా నీ సాధన అడ్డుకొంటుంది. అందుకు సాధన చేయటం అని చెప్పారు.